మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సీఎంలుగా

## మోహన్, విష్ణుదేవ్ ప్రమాణం

భోపాల్/రాయ్‌పూర్/జైపూర్, డిసెంబర్ 13: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్ సీఎంగా విష్ణు దేవ్ సాయ్ ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం మోహన్ యాదవ్ చేత గవర్నర్ మంగూ భాయ్ పటేల్ ప్రమా ణం చేయించారు. ఉప ముఖ్యమంత్రులుగా జగదీశ్ దేవ్‌డా, రాజేంద్ర శుక్లా కూడా ప్రమాణస్వీకారం చేశారు. అలాగే ఛత్తీస్‌గఢ్‌లోనూ సీఎంగా విష్ణుదేవ్ సాయి, డిప్యూటీ సీఎంలుగా అరుణ్ సాహో, విజయ్ శర్మ ప్రమాణం చేశారు. వీరితో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ప్రమాణం చేయించారు. రెండు రాష్ట్రాల్లో జరిగిన ఈ ప్రమాణస్వీకార కార్యక్రమాలకు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నడ్డా తదితరులు హాజరయ్యారు. ఇక రాజస్థాన్ సీఎంగా ఎన్నికైన భజన్‌లాల్ శర్మ, ఉప ముఖ్యమంత్రులు దియా కుమారి, ప్రేమ్‌చంద్ బైర్వా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## ప్రార్థనా స్థలాల్లో లౌడ్ స్పీకర్లపై ఆంక్షలు

- మధ్యప్రదేశ్ నూతన సీఎం కీలక నిర్ణయం

భోపాల్: మధ్యప్రదేశ్ కొత్త సీఎం మోహన్ యాదవ్ ప్రమాణస్వీకారం చేసిన వెంటనే కీలక నిర్ణయం తీసుకున్నారు. దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో అనుమతించదగిన స్థాయికి మించి శబ్దం వెలువడే విధంగా లౌడ్‌స్పీకర్లను ఉపయోగించరాదని ఆదేశించారు. ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తీసుకున్న మొదటి నిర్ణయం ఇది. రాష్ట్ర ప్రభుత్వ అదనపు చీఫ్ సెక్రటరీ (హోం) డాక్టర్ రాజేశ్ రజోరా మాట్లాడుతూ, సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా లౌడ్‌స్పీకర్లను ఉపయోగించడంపై మార్గదర్శకాలను జారీ చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మాంసం అమ్మకాలను కూడా ప్రభుత్వం నిషేధించింది.

# ఖర్గే వర్సెస్ డీకే

### రాజ్యసభ సాక్షిగా బయటపడిన విభేదాలు

**కులగణనకు అడ్డుపడుతున్నారని ఖర్గే ఆరోపణ**

**తాను వ్యతిరేకం కాదని శివకుమార్ కౌంటర్**



స్పెషల్ టాస్క్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సొంత రాష్ట్రం కర్ణాటకలో ఆ పార్టీ నేతల మధ్య విభేదాలు రాజ్యసభ సాక్షిగా బహిర్గతమయ్యాయి. తమ రాష్ట్రంలో ఓబీసీ కులగణన నివేదిక విడుదలకు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో పాటు కొందరు మంత్రులు అడ్డుపడుతున్నారని స్వయానా మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో వాపోవడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నది. ఓబీసీ కులగణనకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, కర్ణాటకలో ఆ నివేదికను ఎందుకు విడుదల చేయడం లేదని రాజ్యసభలో సోమవారం ఖర్గేను ఉద్దేశించి బీజేపీ సభ్యుడు సుశీల్‌కుమార్ మోదీ నిలదీశారు. దీనిపై స్పందించిన ఖర్గే, 'అక్కడ అతను(డీకే) వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ మీరూ (బీజేపీ) వ్యతిరేకిస్తున్నారు. దీనిని బట్టి అగ్రవర్ణాల వారంతా అంతర్గతంగా ఐక్యంగా ఉన్నారు' అని పరోక్షంగా శివకుమార్ చర్యను తప్పుపట్టారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించాక కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి ఆశించారు. కాంగ్రెస్ అగ్రనేతలు కూడా శివకుమార్ వైపు మొగ్గు చూపినప్పటికీ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వ్యతిరేకించడం వల్లనే సిద్ధరామయ్యను ఆ పదవి వరించినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. అప్పటి నుంచి కర్ణాటక కాంగ్రెస్‌లో ఖర్గే వర్సెస్ శివకుమార్ మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కర్ణాటకలో ఓబీసీ నివేదిక విడుదల చేసే అంశం వీరిద్దరి మధ్య విభేదాలు మరింత పెంచింది. కాగా ఖర్గే వ్యాఖ్యలపై డీకే శివకుమార్ కూడా గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో జరిగిన ఓబీసీ కులగణన శాస్త్రీయంగా జరగలేదనే తాము తిరిగి కులగణనకు డిమాండ్ చేస్తున్నట్టు ఆయన బాహాటంగానే ఖర్గే వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు జాతీయ స్థాయిలో బజారునపడటంతో ఆ పార్టీకి కక్కలేక మింగలేని పరిస్థితి ఏర్పడింది.

**సిద్ధు, ఖర్గే వర్సెస్ డీకే**

కర్ణాటకలో ఓబీసీ కులగణన నివేదికను అమలు చేయడానికి అదే సామాజిక వర్గాలకు చెందిన సీఎం సిద్ధరామయ్య సుముఖంగా ఉన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే కూడా ఆయనకు మద్దతుగా నిలిచారు. అయితే ఓసీ వర్గాలకు చెందిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, అదే వర్గాలకు చెందిన కొందరు మంత్రులు నివేదిక విడుదల చేయవద్దని, తిరిగి కులగణన జరగాలని కోరుతూ సీఎంకు లిఖితపూర్వకంగా కోరారు. దీంతో పార్టీ అధిష్ఠానంలో పట్టున్న అటు డీకే శివకుమార్ మాటను కాదనలేక, ఇటు ఓబీసీ నివేదికను విడుదల చేయలేక సిద్ధరామయ్య ఇరకాటంలో పడ్డారు. అమలు చేయని పక్షంలో తమ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తి (సిద్ధరామయ్య) సీఎంగా ఉండి అమలు చేయలేదన్న విమర్శ తప్పదు. అమలు చేస్తే ఓసీ వర్గాలకు చెందిన డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులతో తంటా. కర్ణాటకలో ఈ రకమైన పరిస్థితి ఉంటే, మరోవైపు దేశవ్యాప్తంగా కులగణనకు రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తున్నారు. కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేపడుతామని ఖర్గే హామీ ఇస్తున్నారు.

### చిచ్చురేపిన ఓబీసీ కులగణన

కర్ణాటకలో ఓబీసీ కులగణన నివేదిక ప్రభుత్వానికి సమర్పించినప్పుడు నాడు సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్సే అధికారంలో ఉంది. తదుపరి 2018లో ఎన్నికలు సమీపించడంతో ఎన్నికల ముందు నివేదిక విడుదల చేస్తే తలనొప్పులు తప్పవని భయపడిన సిద్ధరామయ్య దానిని అటకెక్కించారు. ఇటీవల ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఓబీసీ కులగణన చేపడుతామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో కర్ణాటకలో ఓబీసీ కులగణన నివేదిక సిద్ధంగా ఉన్నప్పటికీ అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండి కూడా ఎందుకు అమలు చేయడం లేదన్న విమర్శలు విపక్షాల నుంచి వినిపిస్తున్నాయి. వీటికి కాంగ్రెస్ సమాధానం చెప్పలేక ఆత్మరక్షణలో పడింది. ఈ క్రమంలో ఈ అంశాన్ని బీజేపీ సభ్యుడు సుశీల్‌కుమార్ రాజ్యసభలో ఖర్గేను నిలదీశారు. దీంట్లో తమ తప్పేమీ లేకపోయినా పార్టీలో కొందరి వల్ల దానిని అమలు చేయలేకపోతున్నట్టు ఖర్గే తన నిస్సహాయతను వ్యక్తం చేశారు. దానికి తమ పార్టీలో డీకే శివకుమార్ వంటి అగ్రకుల నేతలు అడ్డుపడుతున్నారని ఖర్గే పరోక్షంగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్‌లోనే కాకుండా రాజకీయ వర్గాల్లో హాట్ టాఫిక్‌గా మారాయి. కర్ణాటక కాంగ్రెస్‌లో నెలకొన్న లుకలుకలు బజారున పడ్డాయి.



కాప్28లో అధికారులను అభినందిస్తున్న కాప్ ప్రెసిడెంట్ అల్ జబేర్

## శిలాజ ఇంధనాలకు స్వస్తి

- కాప్ సదస్సులో 200 దేశాల చారిత్రక ఒప్పందం

దుబాయ్, డిసెంబర్ 13: శిలాజ ఇంధనాలకు దూరంగా ఉండాలని ప్రపంచ దేశాలు నిర్ణయించాయి. వాతావరణ మార్పులకు ప్రధాన కారణం శిలాజ ఇంధనాలేనని, వీటి వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉన్నదన్న నిర్ణయానికి వచ్చాయి. దుబాయ్ వేదికగా జరుగుతున్న కాప్28 సదస్సులో బుధవారం 200 దేశాలు చారిత్రక ఒప్పందంపై సంతకం చేశాయి. గత కొన్ని రోజులుగా సంపన్న, వర్ధమాన దేశాల మధ్య కొనసాగుతున్న విభేదాలు ఎట్టకేలకు ఈ ఒప్పందంతో చల్లారాయి. శతాబ్దాల తరబడి శిలాజ ఇంధనాలతో లాభాలు పొందిన సంపన్న దేశాలు ఇప్పుడు వాటిని తిరస్కరించటం న్యాయం కాదని వర్ధమాన దేశాలు వాదిస్తున్నాయి. అయితే, ఇది మనుగడ కోసం జరిగే యుద్ధమని అమెరికా వ్యాఖ్యానిస్తున్నది. ఈ నేపథ్యంలో ఒప్పందం కొలిక్కి రావటం కష్టమేనని పలువురు అభిప్రాయపడ్డారు. తాజాగా, శిలాజ ఇంధనాల వాడకాన్ని 2050 నాటికి సున్నాకు తగ్గించాలన్న ప్రతిపాదనలతో ఒప్పందంపై దేశాలన్నీ సంతకం చేశాయి.

## మహదేవ్ యాప్ యజమాని అరెస్ట్

- అదుపులోకి తీసుకున్న దుబాయ్ పోలీసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: మహదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ యజమాని రవి ఉప్పల్(43)ను దుబాయ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈడీ అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ జారీ చేసిన రెడ్ నోటీస్ ఆధారంగా ఈ అరెస్ట్ జరిగిందని ఈడీ అధికారులు బుధవారం వెల్లడించారు. ఉప్పల్‌ను ఇండియాకు రప్పించేందుకు దుబాయ్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. ఉప్పల్‌తోపాటు మరో ప్రధాన నిందితుడైన సౌరభ్ చంద్రకర్‌పై రూ.6 వేల కోట్లకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అక్టోబర్‌లో ఈడీ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఛత్తీస్‌గఢ్ మొదటి విడత ఎన్నికల సమయంలో మహదేవ్ యాప్ ప్రమోటర్లు అప్పటి ఛత్తీస్‌గఢ్ సీఎం బఘేల్, ఇతర సీనియర్ నాయకులకు రూ.508 కోట్లు చెల్లించారని ఈడీ తెలిపింది.


## గాజా సొరంగాల్లోకి సముద్రపు నీరు

- హమాస్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసేందుకే

టెల్‌అవీవ్, డిసెంబర్ 13: హమాస్ మిలిటెంట్లను గాజాలోని టన్నెళ్లలోనే జలసమాధి చేసేందుకు ఇజ్రాయెల్ పథకం పన్నింది. ఇందులో భాగంగా సొరంగాల్లోకి సముద్రపు నీరు పంపించడాన్ని ఇజ్రాయెల్ సైన్యం ప్రారంభించింది. దీని ద్వారా హమాస్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడానికి ఇజ్రాయెల్ ప్రయత్నిస్తున్నదని అమెరికా అధికారులు వెల్లడించిన సమాచారాన్ని వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రచురించింది. సొరంగాలను నిర్మూలించడానికి ఇజ్రాయెల్ సిద్ధం చేసిన ప్రణాళికల్లో మెడిటేరియన్ సముద్ర జలాలను వదలడం కూడా ఒకటి. అయితే సముద్ర జలాలను వదలడం వల్ల గాజాకు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురు కావొచ్చని అమెరికా సర్కారు ఆందోళన వ్యక్తం చేసింది. అయితే ఇప్పటికే సొరంగాల వద్ద అమర్చిన అయిదు పంపులకు అదనంగా మరో రెండు పంపులను అమర్చిన ఇజ్రాయెల్ సైన్యం జలాల విడుదలకు సంబంధించిన ప్రాథమిక పరీక్ష నిర్వహించినట్టు సమాచారం.

## కేరళ సీఎం, మంత్రులకు సిగ్గులేదు

- ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ ఖాన్ తీవ్ర వ్యాఖ్యలు
- గవర్నర్ పచ్చి అవకాశవాది అని విజయన్ ధ్వజం
- గవర్నర్ గవర్నర్‌లా వ్యవహరించాలని హితవు
- ప్రభుత్వం, రాజ్‌భవన్ మధ్య ముదిరిన వివాదం



న్యూఢిల్లీ/కొట్టాయం, డిసెంబర్ 13: తనపై దాడికి కేరళ సీఎం పినరయి విజయన్ కుట్ర చేశారని సంచలన ఆరోపణలు చేసిన కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ బుధవారం తాజాగా ముఖ్యమంత్రికి, ఆయన మంత్రులకు సిగ్గులేదని వ్యాఖ్యానించారు. దీనికి సీఎం విజయన్ కూడా దీటుగా బదులిచ్చారు. గవర్నర్ ఆరిఫ్ ఖాన్ పచ్చి అవకాశవాది అని ప్రజలు ముద్రవేశారన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన విధులను మాత్రమే గవర్నర్ నిర్వహించగలరని, గౌరవమైన రాజ్యాంగ పదవిని దిగజార్చవద్దని హితవు పలికారు. ఆరిఫ్ ఖాన్ గత రాజకీయ చరిత్రను పరిశీలిస్తే ఆయనను అవకాశవాదిగా ప్రజలు పేర్కొనేవారని, అలాంటి అవకాశవాద రాజకీయాలు ఇక్కడ చేయడానికి ప్రయత్నించవద్దంటూ విజయన్ హెచ్చరించారు.

## రాష్ట్ర ఆర్థికంపై కేంద్రం జోక్యం

- సుప్రీంకోర్టులో కేరళ ప్రభుత్వం పిటిషన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: రుణాలపై పరిమితి విధించడం వంటి చర్యల ద్వారా రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొంటున్నదని ఆరోపిస్తూ కేరళ సర్కార్ సుప్రీంకోర్టులో తాజాగా పిటిషన్ వేసింది. రాజ్యాంగంలోని పలు నిబంధనల ప్రకారం సొంత ఆర్థిక వ్యవహారాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి అధికారాలు ఉంటాయని, అయితే ఈ అధికారాల్లో జోక్యం చేసుకొనేందుకు కేంద్రానికి ఎలాంటి అధికారం ఉన్నదనే ప్రశ్నలు లేవనెత్తింది. కేంద్ర ఆర్థిక శాఖ 2023 మార్చిలో జారీచేసిన లేఖలు, ఎఫ్ఆర్‌బీఎం చట్టంలోని సెక్షన్ 4కు సవరణలు చేయడం ద్వారా నికర రుణ పరిమితి విధించడం, నికర రుణ పరిమితిని తగ్గించడం వంటి చర్యలతో రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో జోక్యం చేసుకొన్నదని కేరళ ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొన్నది. రుణాలు, బడ్జెట్ తయారీ, నిర్వహణ ద్వారా తన ఆర్థిక వ్యవహారాల నియంత్రణకు రాష్ట్రాలకు ప్రత్యేక అధికారాలు ఉంటాయని పేర్కొన్నది. రుణాల పరిమితిని తగ్గించడం వల్ల రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అభిప్రాయపడింది. 'రాష్ట్ర ప్రభుత్వ అప్పు' అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 కింద ఏడో షెడ్యూల్‌లోని రాష్ట్రాల జాబితాలో ఉన్నదని, అయితే కేంద్ర ప్రభుత్వం అసంబద్ధ సవరణల ద్వారా రాష్ట్రాల అధికారాల్లోకి చొరబడిందని ఆరోపించింది.

